టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలి: సీపీఐ

విశాలాంధ్ర - విశాఖ: టిడ్కో ఇళ్ళను వెంటనే లబ్ధిదా రులకు అప్పగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. విశాఖ వన్‌టౌన్ ఏరియా లోని టిడ్కో ఇళ్ళ సముదాయాన్ని సీపీఐ ప్రతినిధి బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు స్వాధీనం చేయకపోవడం అన్యాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో రాష్ట్రానికి ఏడు లక్షల టిడ్కో ఇళ్ళను మంజూరు చేసిందని తెలిపారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం నాలుగు లక్షల 60వేల ఇళ్లకు టెండర్లు పిలిచిందని అన్నారు. వాటిలో కొన్ని ఇళ్ళ నిర్మాణం 90 శాతం పూర్తయిందని చెప్పారు. అయితే రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు అందజేయకుండా ఉద్దేశ పూర్వకంగా తాత్సారం చేస్తోందని విమర్శించారు. దీని వల్ల ఆ ఇళ్ళు పాడయ్యే ప్రమాదం ఉందని అన్నారు. టిడ్కో ఇళ్ళకు విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని అన్నారు. వచ్చే నెల ఐదో తేదీన టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులతో జీవీఎంసీ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

హౌసింగ్ కాలనీని సందర్శించిన హౌసింగ్ మంత్రి

విశాలాంధ్ర - ఆనందపురం: తంగుడుబిల్లి జగనన్న హౌసింగ్ కాలనీని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇళ్ల నిర్మాణం ప్రతి పేదవాడు సొంతింటి కల నెరవేరే విధంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇళ్ల కాలనీ నిర్మాణ పనుల్లో భాగంగా ఆనందపురం మండలంలో ఉన్న తంగుడిబిల్లి జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన సుమారు 16 వేలకు పైగా ఇచ్చిన ఇళ్లను సందర్శించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్ చైర్మన్ డి.దొరబాబు, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, భీమిలి వైసీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, తహశీల్దార్ లోకవరపు రామారావు, హౌసింగ్ ఏఈ లోకనాథం, ఆర్ఐ మణికంత పాల్గొన్నారు.

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇళ్ల స్థలాలు

విశాలాంధ్ర - పెందుర్తి: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగు రమేష్ అన్నారు. పెందుర్తి మండలం రాంపురం వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదిప్ రాజ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ సుమారు 30 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందజేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయటంతో ప్రతిపక్ష నేతలు ఓర్వలేకపో తున్నారని విమర్శించారు. వికేంద్రీకరణ వల్ల ప్రజలకు అన్ని విధాల మేలు జరుగుతుందని, చిన్న వయసులోనే పెద్ద ఆలోచన చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డిదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన సుభద్ర

విశాలాంధ్ర - అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం సందర్శించారు. ముందుగా ఆమెకు ఎంపీడీఓ శ్రీ హర్షిత్, కార్యదర్శులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని మండల పరిషత్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. చిట్టంపాడు జలపాతం అభివృద్ధితో పాటుగా అహెూ బ్రాండ్ ద్వారా కాఫీ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్న ఎంపీడీఓ శ్రీ హర్షిత్‌ను అభినందించారు.

అథ్లెటిక్స్ క్రీడల్లో సత్తా చాటిన వేచలం విద్యార్థులు

విశాలాంధ్ర - దేవరాపల్లి: ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్ క్రీడల్లో సత్తా చూపిన దేవరాపల్లి మండలం వేచలం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్ క్రీడల్లో అండర్-14 విభాగంలో 11 మంది విద్యార్థినీ, విద్యార్థులు రన్నింగ్, నడక, హైజంప్, మొదలగు క్రీడల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు డి.నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. క్రీడల్లో చక్కని తర్ఫీదును ఇచ్చిన పిడి మాష్టర్ ఆర్.తమ్మునాయుడును గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి లక్ష్మీ బలరాం, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు వీరికి అభినందనలు తెలియజేశారు.

ఏయూను సందర్శించిన నాగాలాండ్ పూర్వ మంత్రి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నాగాలాండ్ రాష్ట్రం పూర్వ మంత్రి, విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ దొషే వై సెమా సందర్శించారు. ఏయూ జియాలజీ విభాగం పూర్వ విద్యార్థి అయిన సెమాను వర్సిటీ తరపున వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద్ రెడ్డి సత్కరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థులు దేశ వ్యాప్తంగా తమ సామర్థ్యాలతో ఉన్న స్థానాలను అదిరోహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జియాలజీ విభాగం ఆచార్యులు ఇ.ఎన్ ధనుంజయ రావు, యుగంధర్ రావులు పాల్గొన్నారు.

షిప్‌యార్డు ఎండీని కలిసిన ఎమ్మెల్సీ మాధవ్

విశాలాంధ్ర - మల్కాపురం: షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రిని ఆయన ఛాంబర్లో మంగళవారం ఎమ్మెల్సీ మాధవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా యార్డ్‌లో ఉన్న పలు సమస్యలను గుర్తింపు యూనియన్‌ను అడిగి తెలుసుకొని ఆయా సమస్యలపై చైర్మన్‌తో మాట్లాడారు. ఎల్ ఎం సీరీస్ రెగ్యులర్, రాబోయే ఆర్డర్స్ గురించి వివరించారు. రెగ్యులర్ విషయంలో రక్షణ శాఖపరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత మంత్రితో సంప్రదిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుకలు

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: పట్టణంలో మంగళవారం నాడు కొత్తపేట శివాలయంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. కళ్యాణ క్రతువును వేద పండితులు శిష్టా బుజ్జి, కాలనాధబట్ల వెంకటేష్ లు శాస్త్రోక్తంగా నిర్వహించగా శిష్టా సాయి, ప్రసన్న దంపతులు కళ్యాణం చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ క్రతువును తిలకించిన భక్తులకు ఆలయ అర్చకులు మేకా భగవాన్ శర్మ అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో గల చీమల పాడు శివారు వలసల పాలెం గిరిజన గ్రామంలో గత కొంతకాలంగా నెలకొన్న విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను అధికారులు నివారించారు. ఈ మేరకు మంగళవారం గ్రామానికి సమీపంలో కొత్తగా సింగిల్ పేజ్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేసి గ్రామస్తులకు విద్యుత్ సమస్య పరిష్కరి ంచారు. రావికమతం - రోలుగుంట మండలాల సరిహద్దులో చలిసింగం కొండకు సమీపంలో వలసలపాలెం ఉంది. గత కొంతకాలంగా విద్యుత్ లో వోల్టేజ్ సమస్య రావడంతో గ్రామస్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్పంచ్ వంజరి గంగరాజు వినతి మేరకు ఆ శాఖ ఏఈ నందన్ చొరవ తీసుకొని ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, లైన్‌మెన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరెక్టర్ విజయ చైతన్య అభినందనలు

విశాలాంధ్ర - సింహాచలం: ప్రముఖ గ్లోబల్ కంపనీ విప్రో తన సంస్థలో పని చేసేందుకు డిప్లొమా చదువు తున్న యంగ్ టాలెంటెడ్ స్టూడెంట్స్‌ను నియమిం చేందుకు నరవలో ఉన్న బెహరా పాలిటెక్నిక్ కళాశాల వేదికయ్యింది. కళాశాలలో పలు విభాగాల్లో చదువు తున్న విద్యార్థిని, విద్యార్థులను విప్రో, విట్టూర్, ప్రభ, యంగ్ మైన్ వంటి సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేసి 211 మందిని ఎంపిక చేశారు. అనంతరం విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. దీంతో కళాశాల డైరెక్టర్ బెహరా చైతన్య సంతోషం వ్యక్తం చేసి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

దారాలమ్మతల్లికి బంగారు మంగళసూత్రాలు బహూకరణ

విశాలాంధ్ర - సీలేరు: జికెవీధి మండలం దారకొండ శ్రీశ్రీ దారాలమ్మ తల్లికి మంగళవారం మండలంలోని దుప్పులవాడ పంచాయతీ కుమ్మరపల్లి గ్రామానికి చెందిన బైసెట్టి బాపూజి దంపతులు అరతులం బంగారు మంగళ సూత్రాలు ఆలయ అర్చకుడు ప్రసాద్‌కు అందజేశారు.

బోరుబావి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - హుకుంపేట: మండల పరిధిలో సూకూరు పంచాయతీ ములుశోభ, దాలింపుట్టు గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా నూతన బోర్ వెల్ పనులను మంగళవారం స్థానిక సర్పంచ్ ధనసాని సత్యవతి, కిలగాడ ఎంపీటీసీ సింహాచలం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జలజీవన్ పథకం ద్వారా ఈ రెండు గ్రామాలకు సుమారు 16 లక్షల రూపాయలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మురళి, వలంటీర్ బుజ్జితల్లి పాల్గొన్నారు.

కొల్లాం సాయి హాస్టల్‌కు నక్కపల్లి హాకీ క్రీడాకారుడు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో మంగళవారం నక్కపల్లి బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ చెందిన హాకీ క్రీడాకారుడు 10వ తరగతి చదువుతున్న అల్లాడ దుర్గా ప్రసాద్ కొల్లాం సాయి హాస్టల్‌కు ఎంపిక అయినట్లు బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఫౌండర్ బి.సూరిబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ తెలిపారు. గత మే 10,11,12 తేదిల్లో కేరళ రాష్ట్రం కొల్లాం లాల్ బహుదూర్ స్టేడియంలో అండర్ 14 హాకీ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన దుర్గా ప్రసాద్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఎంపిక పట్ల అధ్యక్షులు చిన్న అప్పారావు, పలువురు గ్రామపెద్దలు అభినందించారు.

పెట్రోల్ ట్యాంక్ బోల్తా

విశాలాంధ్ర - జికెవీధి: జీకే వీధి మండలం రామగెడ్డ మలుపు వద్ద అదుపు తప్పి పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడింది. విశాఖ నుంచి సీలేరు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్ పూటుగా మద్యం సేవించి నడపడం వల్ల ఈ సంఘటన జరిగిందని స్థానికులు చెబు తున్నారు. కాగా పెట్రోల్ ట్యాంకర్ సీలేరులో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న పెట్రోల్ బంకుకు వెళుతుంది.

దేశపాత్రునిపాలెంలో అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రుని పాలెంలో అక్రమ నిర్మాణాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. రోడ్డు పక్కనే ఎలాంటి అనుమతులు లేని దుకాణ సముదాయాలు ప్రత్యక్షమవుతున్నాయి. కొన్ని చోట్ల రేకుల షెడ్లు వెలుస్తుండగా మరికొన్ని చోట్ల కంటైనర్లను దుకాణ సముదాయాలుగా అక్రమార్కులు ఏర్పాటు చేస్తున్నారు. గాజువాక-ఎలమంచిలి మెయిన్ రోడ్డును అనుకొని బలార్క్ దాబా పక్కన ఇటీవలే ఓ భారీ కంటైనర్ ప్రత్యక్షమయింది. దీనికి ఎటువంటి అనుమతులు లేవు. పైగా అధికారులు పట్టనట్లు వ్యవహరిం చడంతో అక్రమార్కులు దర్జాగా రోడ్డుపక్కన పెట్టి అద్దెలకు ఇచ్చేసారు. ముఖ్యంగా జీవీఎంసీ పరిధిలో ఏదైనా షెడ్డు గాని, నిర్మాణం గానీ చేపట్టినట్లైతే టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ అక్రమార్కులు అవేవీ పట్టించుకో కుండా దర్జాగా కంటైనర్‌ను ఏర్పాటు చేసేశారు. అయితే దీని వెనుక అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. సామాన్యులు ఎవరైనా చిన్న తడికెల షెడ్డు వేసుకుంటేనే నానా యాగీ చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు, రోడ్డు పక్కనే ఇలా భారీ కంటైనర్ ఏర్పాటు చేసినా పట్టించుకోపోవడం అనేక ఆరోపణలకు తావిస్తోంది. తక్షణమే టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అనుమతులు లేని అనధికార కంటైనర్‌ను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

హమాలీలకు పెరిగిన రేటు జీవోను విడుదల చేయాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: సివిల్ సప్లై కార్పొరేషన్ పాయింట్స్ వద్ద పనిచేస్తున్న హమాలీలకు 2022 జనవరి నుండి కొత్త కూలి రేట్లు అగ్రిమెంట్ ప్రకారం జీవో విడుదల చేయాలని యునియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. రెండు నెలలు క్రితం ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వంతో చర్చించి ఎగుమతి, దిగుమతి క్వింటా బస్తాకు 3 రూపాయలు పెంచుతామని రాష్ట్ర సివిల్ సప్లై అధికారులు నిర్ణయించడం జరిగిందన్నారు. దాన్ని జీవో రూపంలో ఇంకా ఇవ్వకపోవడంతో హమాలీల్లో కొంత ఆందోళన కలిగిస్తుందన్నారు. జీవో విడుదలకు రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారుల కృషి చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై హమాలీల ఆందోళనకు ఎఐటియుసి జిల్లా నేత దొరబాబు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, గోవిందరావు, నాగ శంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: సివిల్ సప్లై కార్పొరేషన్ ఎంఎల్ఎస్ పాయింట్స్ వద్ద పనిచేస్తున్న హమాలీలకు పెరిగిన రేటు జీవోను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం పెదబయలు జీసీసీ గోదాము వద్ద సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మేస్త్రి నీలకంఠం మాట్లాడుతూ డిసెంబర్‌తో పాత కూలి రేట్ల అగ్రిమెంటు పూర్తి అయిందని 2022 జనవరి నుండి నూతన కూలి రేట్ల కోసం రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ కు అలాగే ఎండికు విన్నవించినట్టు తెలిపారు. రెండు నెలల క్రితం ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వంతో చర్చించి ఎగుమతి దిగుమతి క్వింటా బస్తాకు 3 రూపాయలు పెంచుతామని రాష్ట్ర సివిల్ సప్లై అధికారులు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అయినా నేటికీ జీవో కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీలు కె.జగన్నాథం, వెంకట్రావు, రామ్మూర్తి, సత్యం, చిరంజీవి, రామారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ఇల్లు మంజూరు

కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అన్నారు. మంగళవారం ఉదయం విశాఖ ఉత్తర నియోజకవర్గం మాధవస్వామి కల్యాణ మండపం మాధవధారలో పలు అభివృద్ధి పనుల పురోగతిపై జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, డిప్యూటీ మేయర్ కె.సతీష్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చాలా పనులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఇళ్ల పథకంలో ఇప్పటికీ ఇంకా అర్హత ఉండి ఇల్లు మంజూరు కానట్లయితే దరఖాస్తు చేసిన 90 రోజులలో తప్పక మంజూరు కాబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బాణాల శ్రీను, కార్పొరేటర్ ఆర్.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల వేధింపుల చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు పనిచేసే చోట లేదా పని ప్రదేశంలో వారిపై జరిగే లైంగిక దాడులు, వేధింపుల చట్టంపై మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మహిళలకు రక్షణగా 2013లో తీసుకొచ్చిన వేధింపుల చట్టం తోపాటు 2012 పోక్సో యాక్ట్, డొమెస్టిక్ వయోలెన్స్ యాక్ట్, దిశ యాక్ట్‌తోపాటు, పలు సెక్షన్లపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నీలిమ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షులుగా రుద్రరాజు నియామకంపై హర్షం

విశాలాంధ్ర - యలమంచిలి: నూతన పీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు నియామకంపై అనకాపల్లి జిల్లా యలమంచిలి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావి రామ సత్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. రుద్రరాజు నాయకత్వంలో యలమంచిలి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి కాంగ్రెస్ పార్టీకి వైభవం తీసుకొస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా రిజిస్ట్రేషన్లు

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ బాలకృష్ణ

విశాలాంధ్ర - కె.కోటపాడు: 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో నూరు శాతం రిజిస్ట్రేషన్ల లక్ష్యాన్ని పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డిఐజి జి.బాలకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ సంవత్సరం రిజిస్ట్రేషన్‌ల ద్వారా 2585 కోట్ల రూపాయలు లక్ష్యం నిర్దేశించగా, అక్టోబర్ నెలాఖరులోగా 1646 కోట్ల రూపాయలు ఆదాయం పొంది 66 శాతానికి చేరుకున్నామని అన్నారు. అలాగే కే కోటపాడు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో 55 కోట్లు లక్ష్యం కాగా నేటి వరకు 32 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ సంవత్సరం స్టాంపులు కొరత రానివ్వకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. ప్రజలకు ఎక్కడ సౌకర్యంగా ఉంటే అక్కడ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. పరిస్థితులను బట్టి అప్పటికప్పుడు భూముల మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ల రుసుములు పెంచే అధికారం కమిషనర్‌కు మాత్రమే ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. విలేకరుల సమావేశంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవరంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి రాజవరం గ్రామ సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ ప్రారంభించారు. డాక్టర్ పి.కావ్య, 104 మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బత్తుల రత్నశేఖర్ గర్భిణీలను, బాలింతలను, వృద్ధులను, పిల్లలను, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరీక్షించి రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి తగు జాగ్రత్తలు సూచించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోసల అమ్మాజీ, గోసల రమణ, కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్, మలేరియా ఇన్‌చార్జి నోడల్ అధికారి పి.ఎస్.వి.యస్.ప్రసాద్, ఎం.ఎల్.హెచ్.పి ఆర్.ధిల్లీశ్వరి, సచివాలయం హెల్త్ సెక్రటరీ ఎల్.సత్యవతి, డి.శివ లక్ష్మి, ఎం.బి.కె.రాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గీతం ఆటోమొబైల్ అప్లికేషన్ శిక్షణ ముగింపు

విశాలాంధ్ర - మధురవాడ: ఇంజనీరింగ్, సైన్స్ పరిశోధనలను ప్రోత్సహించడానికి, అధ్యాపకులలో, విద్యార్థులలో అవగాహన పెంచడానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) ఆంధ్ర ప్రదేశ్‌లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహిస్తున్న "స్తుతి" కార్యక్రమంలో భాగంగా గత వారం రోజులుగా అధ్యాపకులకు నిర్వహిస్తున్న "అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ మెథడ్స్ ఫర్ ఆటోమొబైల్ అప్లికేషన్స్" శిక్షణ మంగళవారం ముగిసింది. ఎయు మెరైన్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.వి.ఎస్.ప్రసాద్ ముఖ్య అతిధిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్‌లు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా నైపుణ్యాలను పెంచుకోవాలని అందుకు "స్తుతి" వంటి కార్యక్రమాలు ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గీతం మెకానికల్ ఇంజనీరింగ్ అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీని వాస్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ బళ్ళ శ్రీనివాస ప్రసాద్, శిక్షణ కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.శివప్రసాద్, డాక్టర్ వి.ఎస్.ఎన్.వెంకట రమణ, కార్యదర్శి డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ సి.హెచ్.శోభ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతం సుగంధ ద్రవ్యాల సాగుకు నిలయం

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

విశాలాంధ్ర - అరకులోయ: విశాఖ మన్యం సుగంధ ద్రవ్యాలకు సాగుకు నిలయమని ఉమ్మడి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు జల్లిపల్లి సుభద్ర అన్నారు. సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించి గిరిజన ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆమె సూచించారు. కేంద్ర స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఓ ప్రైవేటు అతిథి గృహంలో నిర్వహించిన మిరియాలు ఉత్పత్తులు, కొనుగోలుదారుల రెండు రోజుల సదస్సులో ఆమె మాట్లాడారు. సుగంధ ద్రవ్యాల సాగుకు ప్రోత్సహిస్తే విశాఖ, పాడేరు మన్యం అల్లూరి సీతారామరాజు జిల్లా కేరళను మించి పోతుంది అన్నారు. గిరిజనులు అడవిపై ఆధారపడి జీవిస్తుంటారని, మిరియాలు, పసుపు, తేనె, కాకరకాయ వలు రకాల అటవీ ఉత్పత్తులను సేకరించి గత్యంతరం లేక దళారులను ఆశ్రయించవలసి వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీడీఏ సహకారంతో అంతర్జాతీయ ఖ్యాతిని పొందే విధంగా సేంద్రీయ కాఫీ, మిరియాలు సాగు చేస్తున్నారని అన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలో 4800 మెట్రిక్ టన్నుల మిరియాలు,90 వేల మెట్రిక్ టన్నుల పసుపు ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు. కాఫీ పళ్ళను గ్రేడింగ్ చేస్తే రూ.60లకు విక్రయించవచ్చు అన్నారు. మిరియాలు కిలో 400 నుండి 450 వరకు మార్కెట్ ధర పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ శతక బుల్లి బాబు, సుగంధ ద్రవ్యాల బోర్డు డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ జోషి మాధ్య నితిన్ జోయ్, ఎన్‌సీడీసీ రీజనల్ డైరెక్టర్ కే.వి.దుభాసి, పద్మాపురం సర్పంచ్ సుస్మిత, ఎంపీపీ ఉషారాణి, ఎంపీటీసీ కిలో కుమారి గిరిజన రైతులు పాల్గొన్నారు.

SOUTH INDIAN Bank

ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్
రీజినల్ ఆఫీస్, హైదరాబాద్. నం.157/6, మొదటి అంతస్తు, సిహెచ్‌విఐ కాంప్లెక్స్, స్టాఫ్ రోడ్, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, సిఖ్ విలేజ్, డైమండ్ పాయింట్, సికింద్రాబాద్- 500 009.

ఆర్ఓ.-హైదరాబాద్/ఎల్ఇజి/543/2022-23
టు: 1) ఎం/ఎస్. శ్రీ శివసాయి జ్యువెల్స్ భాగస్వామిగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సారేపల్లి శ్రీనివాసరావు, డి.నెం.26 15 9, షాప్ నెం.12 & 13, గ్రౌండ్ ఫ్లోర్, కనక విజయవాణి రెసిడెన్సీ, విశాఖపట్నం, పిన్-530001. 2) శ్రీ సారేపల్లి శ్రీనివాసరావు, తండ్రి వెంకటేశ్వరరావు, భాగస్వామి, శ్రీ శివ సాయి జ్యువెల్స్, డి.నం.42-28-10 మరియు 42-28-9ఎ ఎస్ఆర్ నిలయం, లెనిన్ సెంటర్, సర్వే.నెం.17 భాగం, అజిత్ సింగ్‌నగర్, విజయవాడ, పిన్-520015. 3) శ్రీమతి సారేపల్లి శోభా రాణి, భర్త సారేపల్లి శ్రీనివాసరావు, భాగస్వామి, శ్రీ శివ సాయి జ్యువెల్స్, డి.నం.42-28-10 మరియు 42-28-9ఎ ఎస్ఆర్ నిలయం, లెనిన్ సెంటర్, సర్వే.నెం.17 భాగం, అజిత్ సింగ్‌నగర్, విజయవాడ, పిన్-520015.
డియర్ సర్/మేడమ్,
విషయము: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 8(6) తో చదివే సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం -2002 యొక్క సెక్షన్ 13(2) కింద నోటీసు.
మీకు తెలిసినట్లుగా, మీరు బ్యాంకు యొక్క విశాఖపట్నం బ్రాంచ్‌కు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం ఈ కింద షెడ్యూల్‌లో వివరించిన ఆస్తులను బ్యాంక్ అధీకృత అధికారి 17.08.2019 న లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. మీనుండి బ్యాంకునకు ఎం/ఎస్. శ్రీ శివసాయి జ్యువెల్స్ ఖాతాలో 12.10.2022 నాటికి మొత్తం **రూ.1,23,71,567.92 (ఒక కోటి ఇరవైమూడు లక్షల డెబ్బై ఒక్కవేల ఐదువందల అరవై ఏడు రూపాయల తొంభైరెండు పైసలు మాత్రమే)**లను భవిష్యత్ వ్యయం మరియు వడ్డీతో చెల్లించాల్సి ఉన్నది.
కాగా, షెడ్యూల్ ఆస్తిని భౌతికంగా స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా బ్యాంకుకు చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించడంలో రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారు విఫలమైనందున, ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజుల గడువు ముగిసిన తర్వాత హామీగా పెట్టిన స్థిర ఆస్తి టెండర్లను ఆహ్వానించడం ద్వారా/ బహిరంగ వేలం/ప్రైవేటు ఒప్పందం ద్వారా విక్రయించబడుతుందని నోటీసు ఇవ్వడమైనది. సర్ఫేసీ చట్టంలో పేర్కొన్న విధంగా వేలం తేదీ మరియు సమయం ప్రత్యేక విక్రయ నోటీసు ద్వారా తెలియజేయబడుతుంది. మరియు అత్యధిక బిడ్ మొత్తాన్ని అందించే వ్యక్తికే ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, చట్టం మరియు దాని కింద రూపొందించిన నిబంధనల ప్రకారం, ముందు పేర్కొన్న విక్రయ నోటీసు ప్రచురణకు ముందు బ్యాంకుకు బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా మీకు ఈ నోటీసు జారీ చేయబడింది. ప్రత్యామ్నాయంగా, విక్రయానికి నిర్ణయించిన తేదీకి ముందుగా మీరు కూడా షెడ్యూల్డ్ ఆస్తి కొరకు కొనుగోలుదారులను తీసుకురావచ్చు. తదుపరి ఎటువంటి నోటీసు జారీ చేయకుండా విక్రయతేదీని నిర్ణయించడానికి అధీకృత అధికారి హక్కుకు మరియు/లేదా సర్ఫేసీ చట్టం లేదా అమలులో ఉన్న ఏదైనా ఇతర చట్టం ప్రకారం బ్యాంక్‌కు అందుబాటులో ఉన్న ఏవైనా ఇతర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఈ నోటీసు జారీచేయడమైనది.

ఆస్తి(లు) వివరాలు:
శ్రీమతి సారేపల్లి శోభారాణి సొంతంగా కలిగియున్న ఆస్తి-గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మరియు విశాఖపట్నం రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా పరిధిలో గోకివారి వార్డు, టిఎస్ నం.581 ద్వారా వ్యాపించియున్న మెయిన్ రోడ్డు పడమరభాగం వైపున ఉన్న కనక విజయవాణి రెసిడెన్సీ యొక్క గ్రౌండ్ ఫ్లోర్‌పై, మొత్తం 483 చదరపు అడుగుల్లో 106 చదరపు మీటర్ల కొలత షాప్ నం.12 , 122 చదరపు మీటర్ల కొలత షాప్ నం.13, 118 చదరపు మీటర్ల కొలత షాప్ నం.21, 137 చదరపు అడుగుల కొలత షాప్ నం.22 తో కలిసి 656 చదరపు గజాలు లేదా 548.501 చదరపు మీటర్ల మొత్తం విస్తీర్ణం యొక్క అవిభాజ్య మరియు అనిర్దిష్ట వాటా గల 8 చదరపు గజాలు లేదా 6.689 చదరపు మీటర్ల కొలత స్థలం మొత్తంగా. విశాఖపట్నం ఎస్ఆర్ఓ. యొక్క విక్రయ దస్తావేజు నం.2076/2017 తేదీ: 13.04.2017 నందు మరింత విపులంగా పేర్కొనబడినది. **హద్దులు: స్థలం హద్దులు:** ఉత్తరం: కంటి కల్యాణ్‌జీ ఆస్తి, దక్షిణం: కచ్చా దారి, తూర్పు: మెయిన్ రోడ్డు, పడమర: మున్సిపల్ రోడ్డు. **గ్రౌండ్ ఫ్లోర్‌పై షాప్ నం.లు 12, 13, 21 & 22 హద్దులు:** ఉత్తరం: ఉమ్మడి కారిడార్, దక్షిణం: ఓపెన్ సెట్ బ్యాక్ స్థలం, తూర్పు: షాప్ నం.14&23, పడమర: షాప్ నం.11 & 20.

తేదీ: 13.10.2022 — చీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి

ఇలా అయితే బయటకు వెళ్లేదేలా...

వానరాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

విశాలాంధ్ర-యలమంచిలి: యలమంచిలి మున్సిపాలిటీలో కొత్తపేట, మిలిటరీ కాలనీలలో గత కొన్ని రోజులుగా మరలా వానరాల స్వైరవిహారం ఎక్కువయింది. ఉదయం నుంచి అర్థరాత్రి వరకు పెద్ద పెద్ద శబ్దాలతో ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఏ సమయంలో ఎక్కడినుండి వచ్చి మీద పడతాయో అని భయం భయంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. గత 5 సంవత్సరాల నుండీ ఈ వానర సంచారం ఎక్కువగా ఉన్నప్పటికి కొంత కాలంగా కనిపించలేదు. కానీ ఈ మధ్య ఒక వారం రోజుల నుండి మరలా కాలనీలో వానర సంచారం ఎక్కువైంది. వానరాలు రోడ్డు మీద వెళ్తున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టటం లేదు. నడుస్తున్న ప్రజల మీద పడి మరీ వీటి ప్రతాపాన్ని చూపుతున్నాయి. ఇళ్లల్లోకి చొరపడి నెలవారి అవసరాల కోసం కొనుక్కున్న కిరాణా సామాగ్రిని సైతం పట్టుకుని వెళ్లిపోతున్నాయి. ఉదయం పూట ఇళ్లలో నుండి మంచినీటి కుళాయిల వద్దకి వచ్చే ఆడవాళ్ల మీద ఎగబడుతున్నాయి. బయట పెట్టిన చెత్త డబ్బాలను సైతం కిందపడేసి రోడ్డంతా చిందర వందర చేస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి వానరాల బారి నుండి తమని రక్షించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

శరగడంకు శుభాకాంక్షలు తెలిపిన వేగి

విశాలాంధ్ర - పెందుర్తి: వైసీపీ సీనియర్ నాయకుడు, రూరల్ జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు శరగడం చినప్పల నాయుడుకు పెందుర్తి గ్రంధాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగి శ్రీనివాసరావు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఉదయం ఆయన నివాసానికి వెళ్లి పూలమాల శాలువాతో సత్కరించారు. ఆయన వెంట పెందుర్తి నాయకులు దాసరి అప్పారావు, ఎం.చిట్టిబాబు, అవగడ్డ సోము నాయుడు, శరగడం అప్పారావు, ఎస్.ఎం.రాజు, ఎం.అప్పలనాయుడు, ఎస్.కృష్ణ, వేగి బుజ్జి, బి.వి.సూరప్పారావు, వి.ప్రకాశరావు తదితరులు ఉన్నారు.

అంబలం పూజలో బెహర

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు ఆర్ ఆర్ వి పురం శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయం దగ్గర శ్రీ ధర్మశాస్త్ర పీఠం ఆధ్వర్యంలో అంబలం పూజ జరిగింది. జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణ స్వామి (జూనియర్ జేసుదాస్) భజన బృందంతో అయ్యప్ప పూజలు ఘనంగా నిర్వహించారు. కృష్ణ స్వామిని బెహరా సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ఆలయ కమిటీ అయ్యప్ప స్వామి భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పిదప బెహరను నూతనంగా నియమితులైన గోపాలపట్నం జోన్ 8 శానిటరీ సూపర్వైజర్ కే.వి.రమణ, 92వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ గోపి మర్యాదపూర్వకంగా కలిసారు.

మృతిరాలి కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర - హుకుంపేట: డి.చింతల వీధి గ్రామంలో కొర్ర సన్యాసమ్మ (32) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ వైఎస్సార్ బీమా ద్వారా మంజూరైన లక్ష రూపాయలకు గాను మృతురాలి కుమార్తె కొర్ర దేవికి 10 వేలరూపాయలు సర్పంచ్ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. మిగత 90 వేల రూపాయలు మృతురాలు కుమార్తె అకౌంట్‌లో జమ చేస్తాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అనిల్, నాగేష్, వలంటీర్ కస్తూరి, వెల్ఫేర్ అసిస్టెంట్ శిరోమణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - రావికమతం: రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోట మెయిన్ రోడ్డులో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ నందన్ తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన వివరించారు. బీఎన్ రోడ్డు విస్తరణలో భాగంగా చెట్లు తొలగింపుతో పాటు కొత్తకోట టౌన్‌లో తరచూ విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాన్ని నివారించేందుకు మరమ్మతులు చేపడుతున్నట్టు ఏఈ నందన్ పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.హేమ సుందరరావు తెలిపారు. ఈ సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి హాజరవుతారని చెప్పారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అదికారులు హాజరు కావాలని కోరారు.

సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - చీడికాడ: మండల కేంద్రంలోని శివాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీనివాసరావు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం సుబ్రహ్మణ్య స్వామివారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్‌కు చెందిన గీతానంద స్వామి రామకృష్ణ మిషన్ ద్వారా 90 మంది నిరుపేదలకు దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గండి ముసలినాయుడు, పోతల చిన్ననాయుడు, పరువాడ అప్పారావు, అర్చకులు గరిమెళ్ళ ఈశ్వరరావు, కమిటీ సభ్యులు బొబ్బిలి దేముడు, ఎర్రవరపు మహాలక్ష్మి, దోకుల దాసు, మండల కొండబాబు, పరువాడ రామారావు, రెడ్డి సింహాచలంనాయుడు, పుట్టా గుప్తా, పరువాడ మహేష్, రెడ్డి బలరాం, దొడ్డి శ్రీనివాస్, పరవాడ సత్తిబాబు, పరువాడ రమేష్, సరసట లక్ష్మి, కాళ్ల పాలవల్లి, పరువాడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

విశాలాంధ్ర-యలమంచిలి: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలో జరగనున్నట్లు మున్సిపల్ మ్యానేజర్ ప్రభాకర్ రావు తెలియజేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే సమావేశానికి వైస్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సభ్యులు హాజరు కావాల్సిందిగా కోరారు.

నడింపల్లి కళాశాలలో ట్రైనింగ్ అకాడమీ ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం: శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇంజనీరింగ్ కళాశాలలో అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్, అవుట్ కం బేసిక్ అక్రిడేషన్ గేయంతో ట్రైనింగ్ అకాడమీ స్థాపించారు. ముఖ్య అతిథిగా జేఎన్టీయూకే డిఎపి డాక్టర్ మురళీకృష్ణ హాజరై అకాడమీని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బోధన మరింత నాణ్యతగా ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మురుగదాస్, సెక్రెటరీ ప్రసాదరాజు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో తీసుకెళ్లడానికి డిసెంబర్ 1 నుంచి 45 రోజులు చేపట్టే ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు ఎస్.అబ్రహం, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.దొన్ను దొర కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం టిడిపి మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేస్తున్న విధానాలను గ్రామంలో తీసుకెళ్లి ప్రజలకు అవగాహన పరచడానికి పార్టీ అధిష్టానం ఈ కార్యక్రమం తీసుకుందన్నారు. మండల వ్యాప్తంగా 18 పంచాయితీ గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ మాజీ కోశాధికారి వి.నాగేశ్వరరావు, నాయకులు కె.సుబ్బారావు, టీఎన్టీయూసీ అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - రాంబిల్లి: రాంబిల్లి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం రాంబిల్లి సమావేశ మందిరంలో ఎంపీపీ జి.శిరీషా అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కెఎస్ కొండలరావు తెలిపారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే యూ.వి. రమణ మూర్తి రాజు (కన్నబాబు) హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

హెచ్ఎంకు అభినందన

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ప్రధానోపాధ్యాయులు రాణి లలిత (ఐఐయం) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటు అహ్మదాబాద్ నిర్వహించిన లీడర్షిప్ ఎక్సలెన్స్ ఓరియెంటేషన్ కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈ సంద ర్భంగా ఐఐయం అహ్మదాబాద్ వెళ్లి తిరిగి వచ్చిన హెచ్ఎం లలితను ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రరాజు నియామకం పట్ల హర్షం

విశాలాంధ్ర - పెందుర్తి : పీసీసీ అధ్యక్షులుగా గిడుగు రుద్రరాజు నియామకంపట్ల పెందుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు విన్నకోట రాము, జిల్లా కాంగ్రెస్ నేత ఆర్ఆర్ నాయుడు, స్థానిక నాయకులు రామనాయుడు భానుమూర్తి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. 95వ వార్డు, చీమలాపల్లి అంధుల పాఠశాలలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం విన్నకోట రాము మీడియాతో మాట్లాడుతూ రాజకీయ అనుభవం కలిగిన రుద్రరాజుకు పిసిసి అధ్యక్ష పదవి దక్కడం పార్టీకి శుభసూచకమని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని పేర్కొన్నారు

సీబీసీఎన్‌సీ, సోషల్ వెల్ఫేర్ స్థలాలను కాపాడాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సీబీసీఎన్‌సీ, సోషల్ వెల్ఫేర్ స్థలాలను కాపాడి, అక్రమంగా ఇచ్చిన టిడిఆర్, ప్లాన్ రద్దు చేయాలని జనసేన నాయకులు కోన తాతారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం సీబీసీఎన్‌సీ చర్చ్ భూముల్లోని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ స్థలాన్ని జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ సి బి సి ఎన్ సి చర్చ్ భూముల్లో ఉండాల్సిన సోషల్ వెల్ఫేర్ స్థలం కనిపించడం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు న్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే వైసిపి ప్రభుత్వం, వారి స్థలాలను కబ్జా చేస్తుందని, అందుకు నిదర్శనమే సోషల్ వెల్ఫేర్ స్థలం కబ్జా అన్నారు. ఇక్కడ 3,600 గజాల బాలికల హాస్టల్ స్థలం ఉండేదని, సీబీసీఎన్‌సీ ముసుగులో ఎంపీ ఎంవీవి సత్యనారాయణ, స్మార్ట్ సిటీ వైజాగ్ మాజీ చైర్మన్ జీవి కలిసి కబ్జా చేశారని ఆరోపించారు. జీవీఎంసీ కమిషనర్ కబ్జాదారులకు సహకరిస్తున్నారని, వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో తప్పుడుగా విధులు నిర్వహించిన ఇద్దరు ఐఏఎస్ అధికారులకు నేడు తెలంగాణ కోర్టులో శిక్ష విధించారని, అదే గతి రాజబాబుకు పడుతుందన్నారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ 18 సంస్థలకు చెందినట్లుగా చెబుతున్న సీబీసీఎన్‌సీ స్థలం, యాజమాన్య హక్కు కోసం కోర్టు వివాదాల్లో ఉండగా టి డి ఆర్, ప్లాన్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. 2041 మాస్టర్ ప్లాన్ రోడ్డులో స్థలం పోతుందని, నిబంధనలకు విరుద్ధంగా జీవీఎంసీ కమిషనర్ రాజబాబు టీడిఆర్ ఇవ్వడాన్ని అందరూ గమనించాలన్నారు. కుల మతాలకతీతంగా ప్రభుత్వ స్థలాలను, ప్రజల ఆస్తులను కాపాడడానికి జనసేన పార్టీ ముందుంటుందన్నారు. ఈ నిరసనలో జనసేన చోడవరం ఇంచార్జ్ పివిఎస్ ఎన్ రాజు, శ్రీనివాస పట్నాయక్, శివ ప్రసాద్ రెడ్డి, జనసేన రీజనల్ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, సారని దేవి, శాలిని, వీరేంద్ర, సాయి కుమార్ జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

విశాలాంధ్ర - నాతవరం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నాతవరం మండలం ఏపిపురం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ 99 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. తదనంతరం గతంలో మృతి చెందిన ఎస్‌బి.పట్నం వీఆర్పీ చదల అర్జున్ భార్య మణికి ప్రభుత్వం తరపున రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్షణమూర్తి, జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం గోపి, ఎంపిడిఒ యాదగిరీశ్వరావు, మండల వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచ్ రెడ్డి నూకరత్నం, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షులు పైల పోతురాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు శెట్టి నూకరాజు, వైసిపి మండల బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షులు బండారు నాయుడు, ఎంబి.పట్నం మాజీ సర్పంచ్ వర్రే సత్యనారాయణ, రాష్ట్ర కాపు డైరెక్టర్ సిరిసిల్ల నర్సింగరావు, వైసిపి నాయకులు పోలిరెడ్డి రాజు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రధాన ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - జికెవీధి: సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జికెవీధి మండలం వంచుల పంచాయతీ వీరవరం, కొత్తపాలెం, వి.చెరవల్లి, అరగడపల్లి, వంచుల, ఈ.కోడిసింగి, సిరిబాల, సామగడ్డ, చెరపల్లి తదితర గ్రామాలలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి శివ రత్నం, ఎంపీపీ బోయిన కుమారి, వైసిపి మండల ప్రెసిడెంట్ బొబ్బిలి లక్ష్మణ్, వంచుల సర్పంచ్ వనపల కాసులమ్మ, ఎంపిటిసి జోరంగి సరస్వతి, పెదవలస సర్పంచ్ వంశీకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు అరుణ్, దావనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ, జికెవిధి వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, జికెవీధి ఎంపిటిసి నాగమణి, వైసిపి నాయకులు గిరిబాబు, అంజి, త్రిమూర్తులు, రాజేష్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఐసిడిఎస్ పీఓ లక్ష్మీదేవి, వ్యవసాయ అధికారి మధుసూదన్‌రావు, తహశీల్దార్ రాజ్‌కుమార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అన్‌రాక్ నిర్వాసితులకు స్థలం పంపిణీకి చర్యలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: అన్‌రాక్ నిర్వాసితుకు పశువు షెడ్ల నిర్మాణ నిమిత్తం రెండు సెంట్ల స్థలాన్ని పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు అందాయి. డిసెంబరు నెలలో వైద్య కళాశాల శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రి చేతుల మీదుగా వీటిని పంపిణీ చేసేందుకు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. అయితే అన్‌రాక్ కంపెనీలో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఏడు సెంట్లు స్థలంతో పాటు పశువుల పాకల నిమిత్తం రెండు సెంట్లు స్థలం ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం అంగీకరించింది. తామరంలో 120 ఎకరాల్లో పునరావాస కాలనీ కోసం స్థలాన్ని సేకరించి లేఅవుట్ వేసింది. సుమారు 200 మంది నిర్వాసితులకు 35 ఎకరాల్లో ఏడు సెంట్లు, ఐదు సెంట్లు చొప్పున స్థలాలు పంపిణీ చేసింది. అయితే మిగిలిన 88.5 ఎకరాలు రెండు సెంట్లు స్థలం కోసం 2350 మంది నిర్వాసితుల జాబితాను సిద్ధం చేశారు. ఈ సమయంలో ఆ స్థలం తమదంటూ అన్‌రాక్ కంపెనీ హైకోర్టులో కేసు వేసింది. అప్పటి నుంచి ఈ రెండు స్థలం పెండింగ్‌లోనే ఉండిపోయింది. కాగా ఆ 88.5 ఎకరాల్లో 30 ఎకరాలు తమదంటూ రాచపల్లికి చెందిన రుత్తల సత్యనారాయణ హైకోర్టులో కేసు వేశారు. ఈ రెండు కేసులు ప్రభుత్వం హైకోర్టులో ఉన్నాయి. అయితే ఈ వివాదస్పద స్థలానికి పట్టాలు ఇచ్చేందుకు అధికారులు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. అయితే రెండు సెంట్లు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారా లేదా అనే ప్రకటన చేస్తారో లేదో చూడాల్సిందే.

మోటార్ డ్రైవర్స్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర - విశాఖ: హనుమంతవాక జై హనుమాన్ మాక్సీ క్యాబ్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం ముడసర్లోవ గోల్ఫ్ కోర్ట్ పక్కన మామిడి తోటలో జరిగింది. ఈ సమావేశంలో మోటర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె రెహమాన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో డ్రైవర్లంతా యూనిఫామ్ ధరించాలన్నారు. వాహనం రికార్డులు ప్రతి రోజు చెక్ చేసుకోవాలన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్‌ని దృష్టిలో పెట్టుకుని ప్రమాదాలకు గురికాకుండా వాహనం నడపాలని సూచించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రమాదాల నివారణ పేరుతో మోటార్ కార్మికులకు జీఓ 21 కింద వందల్లో ఫైన్లు వేలల్లో వేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీఓ 21 ని రద్దుచేయాలని, పెట్రోలు, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి. ముఖలింగం, కె. కనకరాజు, వి.పాండు, రమణ, జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి హిమబిందువు ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర - సీలేరు: గూడెంకొత్తవీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే.హిమబిందుకి రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ జె.నివాస్ ఉత్తమ సేవ ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ ప్రశంస పత్రాన్ని మంగళవారం పోస్ట్ ద్వారా పంపించారు. వివరాల్లోకి వెళితే ఈ నెల పదవ తేదీన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా పిహెచ్‌సి వైద్యాధికారి డీకే హిమబిందు గుమ్మిరేవుల గ్రామాన్ని సందర్శించారు. పలు గృహాలను సందర్శిస్తుండగా ఓ గృహంలో తీవ్ర అనారోగ్యంతో కుతుర తులసి బాధపడుతూ ఉండడాన్ని గుర్తించి ఆమెకు రక్త పరీక్షల నిర్వహించగా నాలుగు గ్రాములు హిమోగ్లోబిన్ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ బాధితురాలు నిరాకరించింది. దీంతో వైద్యాధికారి గ్రామ పెద్దలు సహకారంతో బలవంతంగా చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దీంతో ఆమెను అభినందిస్తూ ఉత్తమ సేవా ప్రశంస పత్రానికి ఎంపిక చేశారు.

సర్పంచ్‌లు దైవ దర్శనానికి వెళ్ళకూడదా

విశాలాంధ్ర - కె.కోటపాడు: సర్పంచులు తమ బాధలను ఏడుకొండలవాడికి మొర పెట్టుకోవడం కూడా నేరమేనా.. దైవ దర్శనానికి వెళ్తున్న సర్పంచ్‌లను ప్రభుత్వం అడ్డగించి పోలీసులచే అరెస్టులు చేయడం అప్రజా స్వామికమని మండల టీడీపీ అధ్యక్షుడు రొంగల మహేష్ ఆరోపించారు. సర్పంచుల హక్కులను ప్రభుత్వం హరి స్తున్న నేపథ్యంలో తిరుమల వెంకటేశ్వర స్వామికి విన్నవించుకోవడానికి వెళ్తున్న పలువురు సర్పంచులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. శాంతి యు తంగా నిరసన తెలిపినా పాలకులు సహించలేక పోతున్నా రన్నారు. కె.కోటపాడు మండలం నుంచి ఐదుగురు టీడీపీ మద్దతు సర్పంచులు తిరుమల పాదయాత్రకు వెళ్తుండగా అడ్డుకున్నారని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం, ఆశీస్సులతో సిఎం జగన్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి బూడి ముత్యానాయుడు మనసులు మారాలని కోరుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులను క్రమశిక్షణతో పెంచాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: విద్యార్థులను చిన్నతనం నుంచే తల్లిదండ్రులు క్రమశిక్షణతో పెంచాలని స్థానిక కొల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ టి.సూర్యనారాయణ చెప్పారు. ఆ పాఠశాల ప్రధానో పాధ్యాయుడు వి.త్రినాధరావు అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు దూరంగా విద్యార్థులను ఉంచాలన్నారు. పాఠశాల వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు గత రెండేళ్లుగా కాస్మోటిక్ వస్తువులు తోపాటు ప్రభుత్వం పంపిణిచేస్తున్న ఇతర వస్తువులు పంపిణీ చేయకపోవడంతో వారి సొంత డబ్బులతో నిరుపేద విద్యార్థులు వస్తువులను కొనుగోలు చేసుకుం టున్నారని చెప్పారు. తక్షణమే విద్యార్థులకు ప్రభుత్వం అందించే కాస్మోటిక్ వస్తువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు కె.గౌరమ్మ, సన్యాసమ్మ, కె.సుశీల, జి.గౌరీ, సిహెచ్ రమేష్, సిహెచ్ రామ్మూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - ఆనందపురం: చిరు ధాన్యాలు అభివృద్ధి చోడి పంటలో నాణ్యమైన అధిక దిగుబడులకు ఆచరించదగ్గ మేలైన పద్ధతులపై రైతు భరోసా కేంద్రాల అధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆనందపురం వెలుగు సమావేశ మందిరంలో విశాఖపట్నం జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పథక సౌజన్యంతో ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆశా దేవి మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులను అనుసరించి అధిక దిగుబడిని సాధించేందుకు ఆర్.బి.కే స్థాయి అధికారులు కృషి చేయాలని, పదిహేను మంది రైతులకు ఆత్మ పథకం ద్వారా ఉపకరణాలు (ఎకరమునకు చోడి విత్తనములు 3 కేజీలు, డి.ఎ.పి 40 కేజీలు, ఏంటపీ 15 కేజీలు, కలుపు నాశిని - 1200, కార్బెండాజిం - 250 గ్రాములు) అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయ్ ప్రసాద్, వ్యవసాయ అధికారులు సి. హెచ్.సంధ్య రత్నప్రభ, ఏం.వి.సింహాచలం, పి.శ్రీకాంత్, బి.శశికళ పాల్గొన్నారు.

అన్నదాత అవయవదాతగా..

అవయవదానంకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర - కశింకోట: తాను చనిపోతూ మరో ముగ్గురి ప్రాణాలు కాపాడాడారు రైతు. వివరాల్లోకి వెళ్తే, ఈ నెల 25వ తేదీన అనకాపల్లి జిల్లా కశింకోట మండలం సుందరయ్యపేట శివారు ఆనందపురం గ్రామానికి చెందిన బుర్రెడ్డి చిన్నోడికి మెదడులో రక్తం గడ్డకట్టడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌కి తరలించారు. అతన్ని రక్షించడానికి మూడు రోజుల పాటు వైద్యులు ఎంతో శ్రమించారు. కానీ దురదృష్టవశాత్తు మంగళవారం రోజున బ్రెయిన్ డెడ్ అయింది. ఆ తర్వాత అవయవదానంపై గ్రామ సర్పంచ్ కిమ్స్ ఐకాన్‌లోని అవయవదాన సమన్వయ కర్తలు, మృతిని భార్య, కుమారులు, బంధువులకు అవగాహన కల్పించారు. అనంతరం వారి అంగీకారంతో కిడ్నీలు, లివర్ దానం చేశారు. చనిపోతూ మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక ప్రజలు వారి కుటుంబ సభ్యులను అభినందించారు. జీవన్‌ధాన్ ఆధ్వర్యంలో అవసరం ఉన్నచోటికి లివర్, కిడ్నీలను తరలించారని జీవన్ దాన్ కమిటీ సభ్యులు తెలిపారు.

మౌలిక సదుపాయాలు మెరుగుపరచడమే ధ్యేయం

విశాలాంధ్ర - మల్కాపురం: మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి బడుగు బలహీన వర్గాల ఆర్థిక సామాజిక అభ్యున్నతికి జగనన్న ప్రభుత్వం కృషి చేస్తుందని పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పారిశ్రామిక ప్రాంతం పరిధిలో 61వ వార్డులో స్థానిక కార్పొరేటర్ కొనతల సుధా ఆధ్వర్యంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సుమారు 20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించారు. తదనంతరం 59వ వార్డులో ఆధునీకరణ చేయబడిన1086 331, 1086332 చేయబడిన (రీ మోడలింగ్) సచివాలయంను స్థానిక కార్పొరేటర్/ అధ్యక్షులు పుర్రె సురేష్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంఛార్జి సత్యనారాయణ, సీనియర్ నాయకులు మీసాల పెంటారావు, సోషల్ మీడియా స్పందన బాబురావు సంపత్, కిరణ్, 90వ వార్డు నాయకులు నమ్మి శ్రీను, వార్డు నాయకులు అమరావతి, గౌరీ రెడ్డి, సన్యాసిరావు, పొట్టి మూర్తి, అప్పలరాజు, గిరి, రాజు, అర్జున్, పెద్దిరాజు, అప్పారావు, సరోజ, కుంచారావు సచివాలయ అడ్మిన్స్ సుదీప్తి, సుధీర్ పాల్గొన్నారు.

నేవీ డే ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్ ఐ.పీ.ఎస్. అధ్యక్షతన మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో డిసెంబర్ 4వ తేదీ జరగనున్న నేవీ డే సందర్భంగా రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము విశాఖ పర్యటన ఏర్పాట్లకై నేవీ అధికారులతో కో-ఆర్డినేటింగ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రపతి విశాఖ పర్యటనలో పరస్పరం చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్, లైటింగ్, బేరికేడింగ్, పార్కింగ్, ఐ.డి పాస్ లు తదితర అంశాలు పై చర్చించారు. ఈ సమావేశంలో నేవీ అధికారులైన ఉదయ్ అగర్వాల్ మరియు ఇతర అధికారులు, డి.సి.పి-1 సునీల్ సుమిత్ గరుడ్,ఐపిఎస్., డి.సి.పి(క్రైమ్స్) జి.నాగన్న, ఎ.డి.సి.పి(అడ్మిన్) ఎం.ఆర్.కే. రాజు, ఎ.డి.సి.పి(క్రైమ్స్ ఇంచార్జి ఎస్. బి) డి.గంగాధర్ , ఎ.డి.సి.పి(ట్రాఫిక్) శ్రీ అరిఫుల్లా , ఏ.సి.పిలు, సి.ఐలు, ఆర్.ఐ లు ఇతర అధికారులూ పాల్గొన్నారు.

మండలంలో డిప్యూటీ కమిషనర్ భవాని పర్యటన

విశాలాంధ్ర - అనంతగిరి: ఎన్ ఆర్ పురం పంచాయతీలో ఆర్టికల్చర్ పండ్ల తోటలను డిప్యూటీ కమిషనర్ భవాని పరిశీలించారు. మండలంలోని ఎన్ ఆర్ పురం పంచాయతీలోని మంగళవారం విజయవాడ సిఆర్డి ప్లాంటేషన్ సెక్షన్ డిప్యూటీ కమిషనర్ భవాని పర్యటించారు. ఏన్ఆర్ పురం పంచాయతీలోని ఆర్టికల్చర్లో పండ్ల తోటలు పెంపకం చేపడుతున్న రైతుల వద్దకు వెళ్లి తోటలను పరిశీలించారు. ఈ ఏడాది ఆర్టికల్చర్లో మొక్కలను పంపిణీ చేయడం జరిగిందని, వచ్చే ఏడాది... వర్షాలకు ముందే నిమ్మ, జామ, కొబ్బరి, సపోటా మొక్కలను రైతులు నేరుగా వెళ్లి తెచ్చుకొనేవిధంగా చర్యలు చేపడతామని రైతులకు అవగాహన కల్పించారు. వర్షాలకు ముందే మొక్కలను నాటడంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం ఏన్ఆర్ఈజీఎస్లో జరుగుతున్న భూమి చదును పనులను పరిశీలించారు. వంద రోజులు చాలటం లేదని 150 పని దినాలు కల్పించాలని ఉపాధి కూలీలు ఆమెను కోరారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు. మండల కేంద్రంలోని ఏఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి ఏపీడి పవన్, టీఏ లు కొండలరావు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణా దందాను అరికట్టాలి

టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు

విశాలాంధ్ర -మునగపాక:మునగపాక మండలంలోని పాటిపల్లి మండలంలోని పాటిపల్లి పంచాయితీ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 112,113 మోడల్ స్కూల్ ఆనుకొని ఉన్న కొండను తవ్విస్తూ గ్రావెల్ను అక్రమంగా రవాణా చేస్తున్నారని వైసీపీ నేతల అక్రమాలపై విజిలెన్స్ ఎంక్వైరీ చేసి అక్రమార్కులను బయటపెట్టాలని మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక టిడిపి నేతలతో కలిసి శ్రీనివాసరావు గ్రావెల్ దందాకు గురవుతున్న కొండను పరిశీలించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న కాలనీ నిర్మాణానికి తీసుకెళ్తున్నామని చెప్పి బయట ప్రాంతాలకు తరలిస్తూ భారీ స్థాయిలో సొమ్మును దోచేస్తున్నారని ఆయన ఆరోపించారు.ఈ గ్రావెల్ అక్రమ దందాకు అధికారులు అండదండలు పూర్తిగా ఉన్నాయని,చాలా ప్రాంతాల్లో ఈ అక్రమ దందా సాగిస్తున్న మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తుందని ఆయన అన్నారు.అక్రమ గ్రావెల్ దందాపైతక్షణమే విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమార్కుల భరతం పట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు సబ్బి శ్రీనివాసరావు, పి.మురళి, కొయ్య రమణ, బొడ్డేడ మహేష్ పాల్గొన్నారు.

ఆదివాసిసేన నాయకుల హౌస్ అరెస్టుపై ఖండన

విశాలాంధ్ర - అరకులోయ: శ్రీకాకుళం జిల్లా ఆదివాసిసేన నాయకుడు చొక్కా వరహాల కృష్ణ (రాష్ట్ర ఆదివాసి సేన ప్రధాన కార్యదర్శి) అలాగే కొంతమంది ఆదివాసి సేన నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం తగదని ఆదివాసిసేన రాష్ట్ర నాయకులు సాయిబాబా దురియ,చంచు రాజు ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమాలను అణచివేసే ధోరణితో శాంతియుతంగా గిరిజనుల హక్కులను, చట్టాలను, సమస్యలను పరిష్కరించాలని మంగళవారం చలో టెక్కలి కార్యక్రమంలో భాగంగా పిలుపునిచ్చిన ఆదివాసి సేన నాయకులను అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడం పద్ధతి కాదని అన్నారు. గిరిజనులపై ప్రభుత్వం తీరు మార్చుకోవాలని, గిరిజనుల చట్టాలను హక్కులను పటిష్టంగా అమలు చేయాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో గిరిజనులు ఈ వైసీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించవలసిన పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన జిల్లా నాయకులు సతీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తీర్చేందుకే బోర్లు ఏర్పాటు

కార్పొరేటర్ మొల్లి హేమలత

విశాలాంధ్ర - మధురవాడ: అత్యవసర అవసరాలలో నీళ్ళు అతి ముఖ్యమైనవి, ఆ సమస్య పరిష్కారానికే తొమ్మిది బోర్లు వేయించి ప్రారంభిస్తున్నా మని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత పేర్కొన్నారు. ఒక్కొక్కటిగా వార్డు ప్రజల సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేస్తూ మంగళవారం ఆ బోరును ప్రారంభించారు. ముఖ్యంగా వార్డు ప్రజలకు అవసరమైన రోడ్లు, పార్కుల ఏర్పాటు, మంచినీటి సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ, కల్వర్టుల ఏర్పాటు..ముఖ్యంగా కొండవాలు ప్రాంతాలలో నీటి సదుపాయంపై దృష్టి సారించారు. వీటిలో భాగంగా వార్డు పరిధిలో వైయస్సార్ కాలనీ, స్వతంత్రనగర్, తదితర ప్రాంతాలలో త్రాగు నీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి 9 చేతి పంపు బోర్లు వేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డ్లో ప్రధాన సమస్య అయిన త్రాగునీటి సమస్య లేకుండా చేయడమే తన ధ్యేయమని తెలిపారు. అలాగే తనను నమ్మి గెలిపించిన వార్డ్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వార్డును మరింత అభివృద్ధి చేస్తున్నామని,ఇవి గాక రూ.ఒక కోటీ,50 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు తమ వార్డులో చేపట్టబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు,స్థానిక కాలనీల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి నండూరి ప్రసాదరావు

విశాలాంధ్ర - వన్టౌన్: కార్మిక చట్టాల అమలు, ఉద్యోగభద్రతతో పాటు కార్మిక రాజ్యంకోసం నిరంతరం కృషి సల్పి కార్మికపక్షపాతిగా నిలిచిన నాయకుడు నండూరి ప్రసాదరావు అని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్ నరసింగరావు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సిఐటియు వ్యవస్థాపకులు, మొదటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావు వర్ధంతి జగదాంబ వద్ద కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నండూరి ప్రసాదరావు చిత్రపటానికి నర్సింగరావు పూలమాలవేసి నివాళ్ళించారు. ఆయన మాట్లాడుతూ నండూరి ప్రసాదరావు 50వ దశకంలో అఖిలభారత రైతు సంఘం నాయకులుగా బాధ్యతలు చేపట్టారన్నారు. రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. ఆయనతో పాటు పుచ్చలపల్లి సుందరయ్య కూడా రైతు పోరాటాలు పెద్దఎత్తున నిర్వహించారన్నారు. 70వ దశకంలో ఐక్యత, పోరాటం అనే నినాదంతో సిఐటియు ఏర్పడిందన్నారు. విశాఖపట్నం షిప్యార్డు నాటి ఐఎన్టియుసి గుర్తింపు సంఘం కార్మికులకు నష్టదాయకమైన వేతనం ఒప్పందం చేస్తే దాన్ని కార్మికులు తిరస్కరించే విధంగా నాయకత్వం వహించి మెరుగైన వేతన ఒప్పందాన్ని చేయించారన్నారు. ఆనాడే షిప్యార్డు కార్మికుల యొక్క ఆర్థిక సహాయంతో జగదాంబ వద్ద చిన్న ఆఫీస్ను కొనడం జరిగిందన్నారు. ఆయన మరణించాక ఆ భవనానికి ఎన్.పి.ఆర్ భవనంగా నామకరణం చేసామని గుర్తుచేసారు. కార్మికవర్గంపై జరుగుతున్న దాడిని ప్రతిఘటించడంలో దిట్ట. కార్మిక-రైతు సంఘాలు కలిపి ఉమ్మడి పోరాటాలు, ఐక్యపోరాటాలను రూపొందించడంలో ఆయనకాయనే సాటి. 2000 సంలో బిజెపి, తెలుగుదేశం ప్రభుత్వాలు షిప్యార్డు, బిహెచ్పివిలాంటి పరిశ్రమలకు ఆర్డర్లు లేకుండా దాన్ని నష్టాల్లోకి నెట్టి అమ్మేయాలని చూసాయి. కానీ సిఐటియు వాటిని కాపాడుకోవడంలో ఐక్య పోరాటాలతో పాటు స్వతంత్ర పోరాటాలు నిర్వహించి వాటిని ప్రభుత్వరంగంలోనే కలిపి నడిపివిధంగా విజయం సాధించింది. మోడీ ప్రభుత్వం వచ్చాక డిసిఐని అమ్మేయాలని చూస్తే సిఐటియు విశాఖ ప్రజలను కదిలించి పోరాడి అమ్మకుండా కాపాడిరది. నేడు విశాఖపట్నం స్టీల్ప్లాంట్ను, ప్రభుత్వరంగ సంస్థలు కారుచౌకగా అమ్మేయడానికి మోడీ రెండేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా సిఐటియు ఐక్యపోరాటాలు ప్రాధన్యతనిచ్చి ఉద్యమిస్తోందన్నారు. 44 కార్మికచట్టాలను 4లేబర్ కోడ్లుగా యజమానులకు అనుకూలంగా మార్చింది. బిజెపి అనుసరిస్తున్న సంస్కరణలను రాష్ట్ర వైసిపి ప్రభుత్వం తూ.చ.తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. ఈ రెండు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే కార్మికులకు సరైన మార్గం, ఆయుధమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వవార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావులు మాట్లాడారు. సిఐటియు నాయకులు బి.జగన్, పి.మణి, వై.రాజు, పి.వెంకటరెడ్డి, కె.ఎం.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, జి.పోలేశ్వరావు, ఎం.సూరీడు, మేరి తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వలేదు

రాజధాని మార్చాలంటే పార్లమెంట్లోనే చర్చ జరగాలి

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మూడు రాజధానులపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వలేదని, రాజధాని మార్చాలంటే పార్లమెంట్లో చర్చ జరగాల్సిందేనని మాజీ మంత్రి బండారు సత్యనారయణ మూర్తి అన్నారు. మంగళవారం విశాఖ టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతిపై హైకోర్టు గతంలో స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, టైమ్ కు సంబంధించి ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్ళిందని, టైమ్ కు సంబంధించిన అంశంపై స్టే ఇచ్చారన్నారు. కాని రాజాధాని మార్చాలంటే పార్లమెంటుకు వెళ్లాలని చర్చ వచ్చిందన్నారు. కోర్టు చెప్పిందొకటి వైసీపీ నేతలు చెబుతున్నది ఒకటిని బందారన్నారు. అది సజ్జల ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టేవిధంగా వైసీపీ నేతలు వక్రీకరించారని, సిగ్గులేకుండా స్పీకర్ తమ్మినేని తప్పుదు మాటలు మాట్లాడుతున్నారని. మూడు రాజధానులపై క్లియరెన్స్ ఇచ్చిందా చెప్పాలని ప్రశ్నించారు. దోచుకున్న భూములన్నీ అమ్మకాలు అవుతున్నాయని, వాటిని అమ్ముకునేందుకు కోర్టు తీర్పుని వక్రీకరిస్తున్నారన్నారు. నిజంగా కోర్టు అనుకూలంగా ఉంటే ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడలేదన్నారు. బిల్లు లేదని అసలు వ్యక్తులు చెపుతున్నారని, నేరుగా ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లలేని సీఎం జగన్ అధిక సీట్లు గెలిపించిన రాయలసీమ వాళ్ళనే జగన్ మోసం చేస్తున్నాడన్నారు. ధైర్యం ఉంటే జడ్జిమెంట్ పై పాయింట్ టు పాయింట్ చర్చకు రావాలని బండారు సవాల్ విసిరారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకూ వేచి ఉండాలన్నారు. భద్రత లేదని మీ బాబాయి కూతురే చెప్పిందని, సిబిఐ తో దర్యాప్తు జరిపించాలని మీ బాబాయ్ కూతురు కుమార్తె కోరడం మీ ఫ్యాక్షన్ నైజానికి నిదర్శనం అన్నారు. ఇక్కడ బెదిరిస్తున్నారని సుప్రీంకోర్టుకి మీ బాబాయ్ కూతురు వెళ్లడం చూస్తుంటే సామా న్యులకు మీ పట్ల ఎంత అభద్రతాభావం ముందు గుర్తు చేస్తుందన్నారు.అవినాష్ రెడ్డి చంపారని స్వయానా మీ చెల్లెలు షర్మిల చెప్పారని, స్వంత బాబాయి కూతురుకి రక్షణ లేదని, ఇంకా రాష్ట్ర ప్రజలకు ప్రతిపక్షాలకు ఏమి రక్షణ ఉంటుందని బండారు మండిపడ్డారు. సీఎం కు సిగ్గు ఉంటే బాబాయ్ కూతురుకి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. మొత్తం మర్డర్ డ్రామా అంతా జగన్కి తెలుసుననీ, ఈ కేసులో దోసులందరిని హైదరాబాద్ జైలుకి తరలించాలని డిమాండ్ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో గల కొత్తకోట గ్రామం, బ్రాహ్మణ వీధిలో వేంచేసి ఉన్న అత్యంత మహిమాన్వితమైన శ్రీశ్రీశ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవం, (సుబ్బారాయుడు షష్టి), సందర్భంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేకమైన పూజలు,అభిషేకములు నిర్వహించారు, అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివారి పల్లకి సేవలో కొత్తకోట ఆపరేటివ్ అధ్యక్షులు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, రావికమతం మండల వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి శీలం శంకర్రావు, కొత్తకోట 1 ఎంపిటిసి కుంచా లక్ష్మీ శంకర్, కోట గోవిందరావు, నీలవేణి, ఆలయ అర్చకులు భవాని, మహిళా భక్తులు పాల్గొన్నారు. రాత్రి కళ్యాణ మహోత్సవాన్ని గ్రామానికి చెందిన గుమ్మడి చినబాబు దంపతులు, కేదారిశెట్టి రాజేష్ దంపతులు ఉత్సవ కమిటి సభ్యులు గ్రామ ప్రజలు అధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు.

గ్రామాల్లో జెడ్పీటీసీ పర్యటన

విశాలాంధ్ర - హుకుంపేట: మండల పరిధిలో గల దుర్గం పంచాయితీ సరసపాడు, పాటిగరువు, దారగడ్డ, గనిక గ్రామాలతోపాటు హుకుంపేట మండలానికి ఆనుకొని ఉన్న అనంతగిరి మండలం తున్సిబు, మద్రెబు గ్రామాలలో స్థానిక జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం సందర్శించారు. తున్సిబు నుండి గానిక వరకు సుమారు 4 కిమీ మేర కనీసం రోడ్ సౌకర్యం కల్పించాలని, త్రాగునీరు, సిసి రోడ్డు, మౌలిక సదుపాయాలపై గ్రామస్థులు జెడ్పీటిసి దృష్టికి తీసుకురాగా స్పందిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సరసపాడు అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్న మరమ్మతు పనులు పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ జాన్, వెంకటరావు, సూరిబాబు, సిద్దు, దావీదు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని తహశీల్దారుకి వినతి

విశాలాంధ్ర - పరవాడ: ముత్యాలమ్మపాలెం పంచాయతీలోని 4.20ఎకరాల డి.పట్టా భూమిని కొందరు నిబంధనలకు విరుద్ధంగా క్రయ విక్రయాలు జరిపారని తక్షణమే ఆ భూమిని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు తహశీల్దార్ వి.ప్రకాష్ రావుకు వినతి పత్రం అందజేశారు. చీపురుపల్లి తూర్పు రెవెన్యూ సర్వే నెంబరు 311/3లో గల ఈ 4.20 ఎకరాల భూమిని గతంలో నిరుపేదల కేటగిరీలో చుక్క అప్పన్న కుమారుడు పెద సోములు పేరు మీద అప్పట్లో అధికారులు డి.పట్టా మంజూరు చేశారన్నారు. అయితే ఆ డి.పట్టా దారుదు కొన్నేళ్ల తర్వాత బత్తుల రామకృష్ణ వగైరాలకు ఆ భూమిని అమ్మేసారని పేర్కొన్నారు. తిరిగి 2021లో అదే విస్తీర్ణం భూమిని ఓ స్థానిక నాయకుడు కొనుగోలు చేశారని అందులో వివరించారు. అసైన్మెంట్ నిబంధన ప్రకారం డిపట్టా భూములు అమ్మడం కొనడం నిషేదమని, అయితే ఆ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని సంబంధిత అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని తహసిల్దారుని కోరారు. అలాగే ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం ప్రాంతాల్లో మరి కొంత ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని వాటిపైన కూడా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జివిఎంసి బడ్జెట్పై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ను వాస్తవానికి అనుగుణంగా ఉండేలా రూపకల్పన చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్థాయి సంఘ సభ్యులు, జివిఎంసి అధికారులతో 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ వాస్తవానికి అనుగుణంగా 2023-24 ఆర్థిక బడ్జెట్ రూపకల్పన చేయాలని, బడ్జెట్ ను రూపొందిం చేటప్పుడు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి బడ్జెట్ అంచనాలను తయారు చేయాలని ఆదేశించారు. జివిఎంసి ఆదాయ, వ్యయాలపై స్థాయి సంఘ సభ్యులు అధికారులతో మేయర్ చర్చించారు. అనంతరం బుధవారం కూడా ఈ సమీక్ష నిర్వహిస్తామని మేయర్ తెలిపారు.

మండలంలో అన్ని గ్రామాలకు 104 సేవలు విస్తరిస్తాం

వైద్యాధికారి సునీల్ కుమార్



విశాలాంధ్ర - మునగపాక: మునగపాక మండలంలో అన్ని గ్రామాలకు 104 ద్వారా ప్రజలకు ఉచిత వైద్యం అందించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని మండల వైద్యాధికారి సునీల్ కుమార్ తెలిపారు.104సేవలు నిమిత్తం మూలపేట గ్రామానికి విస్తరించాలని మూలపేట సర్పంచ్ బి శెట్టి గంగ అప్పలనాయుడు నిన్న జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో కూడా 104 సేవలను అన్ని గ్రామాల పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని మంగళవారం మూలపేట గ్రామంలో ఉన్న సర్పంచ్ గంగ అప్పలనాయుడును మండల వైద్యాధికారి సునీల్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ ఉమా మహేష్ సర్పంచ్ ను కలిసి వివరించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

విశాలాంధ్ర -యలమంచిలి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 10 మందికి యలమంచిలి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు మంగళవారం ట్రాఫిక్ ఎస్సై డి. ఈశ్వరరావు తెలిపారు. ఎస్సై తెలిసిన వివరాల ప్రకారం డ్రంక్ అండ్ డ్రైవ్లో ఇటీవల నమోదు చేసిన 10 కేసులకు కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు తెలియజేశారు. వీటిల్లో ముగ్గురికి 5 గురికి ఒక రోజు జైలు శిక్ష, 5గురికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.50,000 జరిమానాగా విధించారన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం వలన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని మద్యం సేవించి వాహనాలు నడపరాదని ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తకు ఘన సన్మానం

విశాలాంధ్ర - సీలేరు: జికేవీధి మండలం వర్తండపాడు అంగన్వాడీ కార్యకర్త రెడ్డంగి పద్మావతి పదవీ విరమణ సందర్భంగా మంగళవారం దారకొండ ఎలిమెంటరీ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా కార్యవర్గ సభ్యులు అంపురంగి బుజ్జబాబు హాజరై మాట్లాడుతూ చంద్రావతి సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ మోహిని, అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు సోమల అప్పలనర్స, దారకొండ సెక్టార్ నాయకులుల యశోదకుమారి, సత్యవతి, దుప్పులవాడ సెక్టార్ నాయకులు కె.కృప, కె.పద్మ, దారకొండ ఆశ యూనియన్ అధ్యక్షులు ఎన్.విజయకుమారి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

శ్రీ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో పారాయణ పోటీలు

విశాలాంధ్ర - పెందుర్తి: శ్రీ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో గీతా పారాయణ పోటీలు నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర గల శివాలయం వీధిలో ఘనంగా నిర్వహించినట్లు

నిర్వాహకులు తెలియచేసారు. ఈ పోటీలలో వివిధ పాఠశాలల నుండి సుమారు రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. గితా ప్రచార సమితి ఉపాధ్యక్షులు పిల్లా జగన్మోహన్ రావు విద్యార్థులు ప్రభాస్ వర్మ, శేశాంక్, కుశల్, కుశ్వంత్ పాల్గొన్నారు. పాల్గొన్న విద్యార్థులందరికి ధృవ పత్రాలు అందజేశారు. అలాగే గెలుపొందిన విద్యార్థులకు డిసెంబర్ 4న గీతా జయంతిని పురస్కరించుకొని బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షులు యోందూరి కృష్ణమూర్తి, అధ్యక్షులు చావలి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షలు పిల్లా జగన్మోహన్ రావు, కార్యదర్శి ఎం.వనజాదేవి, జనరల్ సెక్రటరీ జి.వి.ఆర్ ప్రసాద్, కోశాధికారి కె. ఈశ్వరుదు పాల్గొన్నారు.

వార్డులో మౌళిక వసతులు కల్పిస్తాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రతి వార్డులో మౌళిక వసతులు కల్పిస్తామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె క్షేత్ర స్థాయి పర్యటన లో భాగంగా జోన్-4, 29వ వార్డు పరిధిలోని ప్రకాష్ నగర్, దండు బజార్, రామ జోగి పేట, చాకలి వీధి తదితర ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ పి రాజా బాబు, వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణ రావు తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ సంయుక్తంగా మాట్లాడుతూ ముఖ్యంగా వార్డులో పారిశుధ్యం, త్రాగు నీరు, విద్యుత్ దీపాలు, రోడ్లు, కాలువల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వార్డులో ఖాళీ స్థలాలలోనూ, ఇళ్ళ మధ్యన పిచ్చి మొక్కలు అధికంగా వున్నాయని వాటిని ఇంటి యజమానులచే తొలగించేలా చూడాలని, వారు స్పందించని యెడల జివిఎంసి పారిశుధ్య సిబ్బందిచే తొలగించి ఆ స్థల యజమానుల నుండి అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసి రావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఎఎంఓ హెచ్ డాక్టర్ కిషోర్, కార్యనిర్వాహక ఇంజినీరు రమ్మన్ మూర్తి, ఎసిపై వెంకటెస్వారరావు తదితరులు పాల్గొన్నారు.

టూటౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన బెండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఇటీవల సిఐలు బదిలీల్లో భాగంగా టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ గా నియమితులైన బండి తిరుమలరావు మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నగరంలో ఉన్న వివిధ పోలీస్ స్టేషన్ ల్లో సిఐ గా పని చేశారు. శాంతి భద్రతలు నిర్వహణలో తిరుమలరావు కు మంచి పేరు ఉంది. విశాఖ కమిషనరేట్ లో చురుకైన, నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్గా తిరుమలరావు అనేకమంది కమిషనర్ల నుండి మన్ననలు పొందారు.